కథా నిలయం
3773
శ్రీకాకుళం

# సందులో మందారం

రాజారావులాంటి గుమాస్తాల అంతః పురాలకి రమణీయమైన హంగులేం ఉంటాయి కనక? మహాఉంటే ఓ గదీ వసారా, ఓ, హాలూ వంటిల్లూ. అంతేకదా? ఈ నాలుగు స్వరూపాలు మహాసామ్రాజ్యంలోనే ఎలాగో అలాగ సర్దుకుపోవాలి గాని "కాదూకూడదు. కాలు కదుపుకోడానికైనా కాళీ లేకపోతేఎలా" అంటూ కత్తి ఝుళిపిస్తే ఏం ప్రయోజనం? పోనీ ఎక్కైనా సామ్రాజ్యాన్ని విస్తరింపచేద్దామా అనుకుంటే వీలులేకుండా వచ్చింది.

ముందున్న స్థలంలోకి సరదాగా కాళ్ళు జాపుదామనుకుంటే, "టాట్? వీల్లేదు?" అన్నారు పురపాలక సంఘీయులు, "ఇప్పటికే నీ చీడీలు మా రోడ్డుమీదకి జాపేశావు అదీచాలక ఇంకా కాళీస్థలం కాళీస్థలం అంటూ మా రోడ్డుని కూడా ఆక్రమించేసుకోవాలని ముచ్చటపడకుమరి?" అంటూ

మ్యునిస్‌పాలిటీవాళ్ళు ముద్దు ముద్దుగా రిజిష్టర్డ్ శుభలేఖని కూడా అందించారు. మంచీ మర్యాదా ఏం ఆలోచించకుండా, పోనీ అంతఃపురం వెనక ఏదైనాజాగా అఘోరించిందేమో అంటే, "సరిహద్దు వంటింటిగోడతోటే సరి. కాదంటావా కర్రలు తీసుకుందాం రా?" అంటాడు వెనకింటి హిరణ్యాక్షుడు. సరే - కుడివైపు చూడ్డానికే వీలులేదు కదా! ... "సీవసారా దాటి ఒక్క అడుగు వేశావో తోళ్ళు ఒలిచేస్తాను జాగ్రత్త!" అన్నట్లు గుడ్లురిమి మరీ చూస్తాడు కుడివైపు కుటుంబరావు. ఇకపోతే రాజాకి కాస్తస్థలం అంటూ కనిపించేదల్లా ఎడంవైపు మాత్రమే!

అదైనా, వంటింటినీ పడకగదినీ ఆనుకొని, సన్నగా ఇంటిముందు నుంచి వెనకదాకా ఓ పీలికలా మిగిలింది కాస్తస్థలం, పీలికైతే ఏం చీలికైతే ఏం, ఎటుచూసినా తనదంటూ చెప్పుకోగలిగే ఖాళీస్థలం అదేగా కనిపిస్తూంట? అందుకే అదంటే ప్రాణం రాజాకి. అడుగున్నర వెడల్పూ, దాదాపు ఇరవై అడుగుల పొడవూగల సన్నని గొట్టంలాంటి ఆ స్థలాన్ని "సందు" అని పిలిస్తేమాత్రం ససేమిరా ఒప్పుకోడు రాజా. అంట్లుతోమడం వంటి గృహ పారిశుధ్య కార్యక్రమాలకి, దాసదాసీజనం రాకపోకలు సాగించాలన్నా, అతిథుల రూపంలో శత్రువులు ఎవరేనావచ్చి హాల్లో బైఠాయిస్తే వంటింట్లో చిక్కుకుపోయిన తన మహారాణి వీథిలోకి వేంచేయాలన్నా ఆ సన్నని స్థలమే శరణ్యం. అందుకే దాన్ని సందు అనకూడదనీ "అత్యవసరమార్గం" అనాలనీ వాదిస్తూ ఉంటాడు రాజా. ఆమార్గం, సామ్రాజ్య పరిరక్షణకి ఎంతో అవసరమైనదని గట్టి నమ్మకం కూడా.

అతనికి. అందుకే అంతటి కీలకమైన ఆ ముఖ్యమార్గానికి కొన్ని రహదారీ నిబంధనల్నీ, అందుకుగాను కొన్ని చట్టాల్ని ఏర్పాటు చేశాడు, వాటి ప్రకారం.

1) ఆ మార్గంలో ఎవరేనా ఒక వ్యక్తి ఆచివరనుంచి బయలు దేరుతున్నట్లు అనుమానం తగిలితేచాలు, వెంటనే ఈ చివరివ్యక్తి ఇక్కడే బయలుదేరడం ఆగిపోయి "వన్ వే ట్రాఫిక్ రూల్సునీవే", వాటిని అతిక్రమిస్తే వచ్చే ప్రమాదాలని మననం చేసుకుంటూ కాస్సేపు కాలక్షేపం చెయ్యాలి. (అయితే భార్యాభర్తల విషయంలో మాత్రం సదరు నిబంధన సమయానుకూలముగా సడలింపబడును.

2) మార్గమధ్యంలో ఎవరూ అకారణంగా ఆగిపోయి ఇతర ప్రయాణికుల రాకపోకలకి అవరోధం కలిగించరాదు.

3) విశాలమైన బుజాలు ఉన్నవాళ్ళు బాగా కుంచించుకుని వెళ్ళడం ఎందుకేనా మంచిది. లేకపోతే వాళ్ళ బుజాలు ఇటూ అటూ ఉన్న గోడలకి రాచుకొని రక్తం చిమ్మినా చిమ్మవచ్చు.

4) బాగా లావుగాఉన్న వ్యక్తులు ఆ మార్గంలో ప్రయాణం చెయ్యాలని సర్వ సాధారణంగా ముచ్చట పడకూడదు. ఒకవేళ తప్పనిసరిఅయి ప్రయాణం చెయ్యవలసివస్తే, ముందు జాగ్రత్తకోసం అటువంటి స్థూలకాయులు పీత నడకని ఓమారు జ్ఞాపకం తెచ్చుకొని, ఆద్యంతమూ తమ శరీరాన్ని అడ్డంగా తిప్పి వెళ్ళడమే శ్రేయస్కరం. (ఆతర్వాత వాళ్ళు మార్గమధ్యంలో బిరడాలాగా బిగుసుకుపోతే ఇంటివారి పూచీ లేదు.)

5) తట్టలూ బుట్టలూ వగైరా, లంబరుహూమ్, సామాన్లన్నీ ఆ మార్గంలో పెట్టి వచ్చేపోయే, మనుష్యులు అవితగిలి బోర్లాపడే సౌకర్యాలు కల్పించకూడదు.

ఈ నిబంధనలతో రహదారీ రక్షితమై పోయింది. అనుకున్నాడు కాని ఈచట్టాలకి లోబడని కొత్త సమస్యలు కొన్ని ఉంటాయని ఊహించలేక పోయాడు ఆ సామ్రాజ్యాధినేత అయిన రాజారావు.

ఓరోజు సాయంత్రం తాలూకా కచేరిఅనే దర్బారు నుండీ అంతఃపురానికి వేంచేసిన ఆ మహారాజుని సందులో కొత్తగా వెలసిన మందారం మొక్క ఒకటి వాలుగా ఒంగి చూసి పరిహాసం చేస్తూ పలకరించింది. తన కొలువుకూటంలో హఠాత్తుగా శత్రురాజు ప్రత్యక్షం అయినట్లు నిర్ఘాంతపడి ఆమట్టునే చూస్తూ ఉండిపోయాడు.

అసలు మందారం అంటేనే మహామంట రాజాకి. దూరంనుంచి కళ్ళతో కవ్వించి నవ్వులతో మత్తెక్కించి ఆ మట్టునే పారిపోయే అందమైన ఆడపిల్లలన్నా, ఎన్నో ఆశల్ని కల్పించి అరచేతిలో స్వర్గం చూపించి అసలుకి మాత్రం సున్నచుట్టే గవర్నమెంటు జి. వో. లన్నా, అలంకారార్థం ఎప్పుడూ జేబులోనే ఉంటూ, ప్రతినెల తనచేత మాత్రం చావగొట్టి బ్లాక్ మార్కెట్ లో సరుకు కొనిపించే పంచదారకార్డు అన్నా, ఎర్రగా బుర్రగా కులుకుతూ గాలికి షోగ్గా ఊగుతూ, ఓ వాసనా పరిమళం ఏంలేకుండా, అందమైన బడుద్దాయి అమ్మాయిలా డాబుసరిగా ఉండే మందార పువ్వు అన్నా మహాచెడ్డ చిరాకు. మరి అలాంటప్పుడు

ఆ బడుద్ధాయి మందారం అనబడే ఆ నిర్గంధ కుసుమం సరాసరి తన ఇంట్లోకే వేంచేసిందంటే వళ్ళు మండదూ?....అందులోనూ అక్కడా ఇక్కడనా? తను అపరిమితమైన ఆప్యాయతతో చూసుకొనే ఆ రక్షిత ప్రదేశంలో .... ఆరహదారీ మార్గంలో !

తనకి తెలియకుండా, తన అనుమతి ముందుగా పొందకుండా ఆ మందారం అక్కడ ప్రత్యక్షం కావడంతో తన రాజ్యంలో తన మాటకి విలువపోయినట్లూ తనచట్టాలు, శాసనాలు ఉత్తచెత్త కాగితాలులా ఎగిరిపోతునట్లూ ఫీలయ్యాడు ఆ మహారాజు.

ఇంత సాహసాన్ని ఎవరుచేశారు చెప్మా? తన శాసనాన్ని ఇంత ధైర్యంగా ఎవరు ధిక్కరించారు? ఎవరు తన భయంకరమైన కోపానికి శలభం కాబోతున్నారని ఆలోచిస్తూ సింహద్వారం దగ్గర ఆమట్టునే ఆగిపోయిన తన మారాజుని చూచి "అదేవిటండి! నేలమీద ఆన్చి సైకిలు మీంచి దిగకుండా ఆమట్టునే ఉండిపోయారు! పట్టపు టేనుగుదిగి అంతఃపురంలోకి వేంచేయండి!" అంటూ నవ్వుతూ ఎదురువచ్చింది మహారాణి.

రాణీనవ్వు చూస్తే తనకి మతిపోతుంది. "అలా పోకూడదు" అంటూ మతిని ఎన్నోమార్లు కూకలేసి చూశాడు...ఊహు... అది తనమాట వింటేనా? ఆమె నవ్వు అలాచూడ్డం ఏవిటి, ఇలా పలాయనం చిత్తగించడం ఏమిటి? పెళ్ళి అయినప్పటినుంచి ఇదే తంతు ఆమతికి. సరే కానియ్యి. మహారాణినిచూసి మహారాజు మతిపోగొట్టుకోక

పోతే ఎలా? ఈ రోజుల్లో దారినిపోయే దాసీదానిని చూసే
కొందరు యువకులు మతి పోగొట్టుకుంటున్నారే, అటువం
టప్పుడు అందమైన రాణీ అందులోనూ సాక్షాత్తూ తన
మహారాణిని చూసి తను కాస్త మతిపోట్టుకుంటే ఏం?
అంటూ సర్దుకున్నాడు ఆ రాజాధిరాజు.

రాణీ ఎదురువచ్చి ఎప్పుడూ లేంది చేతిలో ఆఫీసు
కాగితాలు అందుకుంది. విప్పుతూన్న చొక్కాని అందుకుని
పాగా కొయ్యకి తగిలించి టవలూ పంచే అందించింది.
బాత్ రూమ్‌లోంచి వస్తూంటే, వట్టి కాఫీకాకుండా స్వీటూ
హాటూ సమేతమయిన కాఫీని అందించింది. పక్కని విసు
రుతూ నిలబడింది.

ఓయి బాబోయ్!

ఇవేం రాజోపచారాలు రోయ్!

ఓ బంగారపు నగకో, ఓ పట్టుచీరకో, అథమం ఓ
హిందీసినిమాకో ఇదంతా నాందీకాదుకదా కొంపతీసి: రాజు
గారికి గుండె ఆగినంత పని అయింది. భయం భయంగా
తలెత్తి ఆమెకేసి చూశాడు.

“భయంలేదు భక్తా!” అన్నట్లు ఆమె నవ్వింది. అభయం
ఇస్తున్నట్లు చేసిన ఆ మందహాసంతో ఎంత గర్వం
మకెంత సంతృప్తి. ఇకెంత గొప్పఉన్నాయని ఏదో ఘన
కార్యం చేసినట్లున్న ఆ మందహాసంచూస్తే “ఏమై ఉంటుంది
చెప్మా!” అని తెగ ఆలోచించి పారేశాడు రాజారావు.

“నీకెందుకు రాజా అంత శ్రమ? నువ్వు ఆలోచించ
నక్కర్లేదు. నేనే చెప్తా లే!” అన్నట్లు చూసి, పక్కపలుకు

అందిస్తూ చల్లగా చెప్పింది రాణి "మొక్కలు అమ్మొచ్చాయండీ ఇందాకాను. దేవుడికి పూజచేసుకోవాలన్న సరదాగా ఎప్పుడేనా సిగమీద ఓ పువ్వును తురుము కోవాలనిపించినా ఉంటుందని ఓ చిన్న మందార మొక్కని కొన్నాను" అంటూ. ఆ మాటల్లోనే "చూశారా మందారం ఎలా ఇహపర సాధనమౌను" అన్న అర్థాన్ని కూడా ధ్వనించింది.

ఆమె ధ్వనిమాట ఎలాఉన్నా, అతని బుర్రలో మాత్రం, తెలుగు సినీమాలో భయంకర సన్నివేశానికి ముందు వినిపించే రకరకాల వాయిద్యాల కలగాపులగపు ధ్వనిమాత్రం, ఒక్క క్షణం కరాళ నృత్యము చేసేసి ఆ మట్టున తక్కున ఆగిపోయింది.

రాజా నేపథ్య సంగీతానికి అనుగుణంగా ఆవేశంతో ఊగిపోయాడు. "ఏమిటి? ఆ మందార మొక్కని పాతింది నువ్వా?" అన్నాడు గట్టిగా.

"అవును ఆ ఘనకార్యం చేసింది నేనే!" అన్నట్లు నవ్వుతూ తల ఆడించింది రాణి.

"ఆ దిక్కుమాలిన మొక్కని అసలు ఎందుకు కొన్నావు?" అన్నాడు రాజా కోపంగా.

"అదేవిటండీ...నిక్షేపంలాంటి మందార మొక్కని పట్టుకుని దిక్కుమాలిన మొక్క అంటారు? 'మందార మకరంద మాధుర్యమునదేలు మధుపంబు బోవునే మదనములకు" అనే మధురమైన పద్యం వినలేదా? అంటూ తిరిగి ఆ పద్యాన్ని ఆనందభైరవిలో ఆలాపించిబోయింది.

"ఆలాపన కాన్సెసు ఆపుచెయ్యి" అని ఆలోచనలో పడ్డాడు రాజారావు. "అవునుగానీ ఆ పోతన మహాశయుడికి దొరక్క దొరక్క ఈ చెత్తపువ్వే దొరికిందా పద్యం రాయడానికి? ఇంతకన్నా పసందైన పువ్వు ఆయనకి కనిపించ లేదా, లేక ఈపువ్వే ఆరోజుల్లో మహా పసందుగా ఉండి వాసనలు గుబాళిస్తూ రాను రాను ఆడవాళ్ళలో అణుకువ లాగే దానిలో ఉండే వాసనకూడా తగ్గిపోతూ వచ్చిందా?" ఇలా తన చిత్తంవచ్చినట్లు ఆలోచించేస్తున్న ఆ మహారాజు భావ లహరికి ఠక్కున ఆనకట్ట పడింది.

"అది సరేకాని, నేనా మందారం కొని అక్కడ నాటడం మంచి ఐడియాకదూ? ఎలావుంది?" అంది రాణి

"ఏడిసినట్టుంది?" శపీమని సమాధానం ఇచ్చాడు పతిదేవుడైన ఆ రాజారావు

"ఎంతమాట! అంతమాటే! తనని అంతమాట అనే శాక ఇంకతణ్ణి పతిదేవుడుగా గౌరవించడం ఎందుకు?" అనుకుంది ఆ మహాపతివ్రత. అనుకుని ఆమట్టుని కోపంగా ముఖం పెట్టేసి "ఏం? ఎందుకట? అంటూ రంగంలోకి దిగింది పైట బిగించి, గాజులు మోచేతులుదాకా తోసుకుని యుద్ధానికి సిద్ధం అవుతూ.

"ఓహో రంగం చెడిందే! ప్రమాదం వచ్చేలాగ ఉంది" అని గ్రహించాడు. తహసీల్దారుగారి కోపతాపాల వాతావరణాన్ని ముందుగా పసికట్టడానికి అలవాటు పడ్డ రాజారావు. అందుకే పరిస్థితులు చెయ్యి దాటిపోకుండా జాగ్రత్త పడుతూ "అది కాదు రాణీ! మనకున్న స్థలమే ఆ

కొంచెం కదా! ఇప్పుడే అక్కడ ఒక మనిషివస్తే ఇంకోమనిషి తప్పుకోడానికి వీలులేకుండా ఉంటే, నువ్వా మొక్క కూడా అక్కడ పట్టుకొచ్చి పాతితే ఎలా?" అంటూ అర్థం అయేలా నచ్చచెప్పబోయాడు.

"అక్కడ కాకపోతే తమరు సంపాదించిన ఈ మహా సామ్రాజ్యంలో వేరే స్థలం ఎక్కడ ఉంది? కాకపోతే ఇంకా గదిలో గచ్చు బద్దలుకొట్టి పాతాలి. అంతే!" అంటూ గయ్‌మంది.

తను ఎంత నమ్రతగా మాట్లాడుతున్నాడు! ఆమె ఎంత దురుసుగా జవాబిస్తోంది! మహారాజుకి ఒళ్ళు మండి పోయింది. అయినా తాపీగా అన్నాడు" అది కాదు రాణీ! ఆ సన్నని మార్గంలో ఈ మొక్క పాతితే ఇటూ అటూ నడవడానికి ఇబ్బంది కదూ" అంటూ.

"ఇబ్బంది ఏమిటి? అదేం నేలమీద కూచుంటుందా ఏమైనానా? పైకి ఎదిగిపోతుంది"

"గొప్పలే! మహచెప్పావు! మొక్క అన్నాక పైకి ఎదగక కిందకి ఎదుగుతుందా ఏవిటి" అంటూ మనస్సులోనే వెక్కిరించాడు.

"రండి చూద్దురుగాని ఎంత అందంగా పాతేనో! దానివల్ల సందుకంతకీ అందం వచ్చింది."

"అదిగో! ఏవిటా మర్యాదా లేకుండా మాట్లాడడం? అత్యవసర మార్గం అనలేవూ? సందట సందు!" సణుక్కున్నాడు రాజారావు.

"ఏవిటండీ మీలో మీరే అనుకుంటున్నారూ?... లేవండి అంది రాణీ.

"ఎందుకూ?" అన్నటు చూశాడు. "నాచేత్తో నేను పాతాను కదా. మీచేత్తో మీరు కాసిన్ని నీళ్ళు పోస్తే...."

"హమ్మ! ఇదా నీ ఎత్తు? మా తహసీల్దారుని మించి పోయావు. రేప్పొద్దున్న కాదూకూడ దనడానికి వీలు లేకుండా ప్రతి కాగితంమీదా సంతకం పెట్టించి కమిట్ చేయిస్తూ ఉంటాడు. అలాగే యిప్పుడు నేను నీళ్ళుపోస్తే, ఆనక "తీసెయ్య" అనడానికి నాకు నైతికబలం పోతుందనా నీఎత్తు? నువ్వెంత లాయరు చెల్లెలివైనా నాకూ కాస్త తెలివీ బుద్ధీ ఇచ్చాడు భగవంతుడు నేను చచ్చినా నీళ్లుపోసి నీ నేరానికి మద్దతు ఇవ్వను. ఆహా!....ఇలా మోసం చేదాం అనుకున్నావా?" మనస్సులోనే అనుకున్నాడిదంతా.

"ఏవిటీ? మీకా మొక్క పాతడం ఇష్టంలేదా? మీ ఉద్దేశ్యం ఏదో స్పష్టంగా చెప్పెయ్యకూడదూ?" అంది తాడోపేడో తేల్చెయ్యండి అన్నట్లుగా.

కాస్సేపు నానా అవస్థపడి ధైర్యాన్ని ఎలాగైతేనేం కూడగట్టుకొని, "నా ఉద్దేశం ఏమిటంటే వెంటనే ఆ మందారాన్ని అక్కడనుంచి పీకి పారెయ్యడం" అంటూ చాలా సౌమ్యంగా, ఎంతో మెత్తగా, అతి సుకుమారంగా తెలియ బరిచాడు తన భావాన్ని,

"ఏమిటీ" ఇంత ముచ్చటపడి వేస్తే పీకి పారెయ్యాలా?"

"అవును అది అక్కడ ఉండడానికి వీల్లేదు."

"ఏం?"

"అంతే!"

"అయితే అది అక్కడే ఉంటుంది."

"ఎలా ఉంటుందో చూస్తాను"

"నేనూ చూస్తాను."

హారోం హర ఇంకేముంది? పట్టుదలలు పెరిగాయి పౌరుషాలు హెచ్చాయి. ఒకళ్ళంటే ఒకళ్ళకి విపరీతమైన కోపం, విసుగూ, అసహ్యం బయలుదేరాయి. ఒకళ్ళ పచ్చ ఒకళ్ళకి కిట్టడం మానేసింది. 'సరే కానియ్యి' అంటే 'సరే కానియ్యి' అనే తత్వం ప్రారంభ మయింది. రాజా రాణీతో మాట్లాడడం మానేశాడు. రాణి రాజాని పలక రించడం ఆపివేసింది.

ఇంట్లో మాటలువచ్చిన మనుష్యులు ఇద్దరూ ఇలా మౌన వ్రతాన్ని పట్టడంతో, నోరూవాయీలేని తలుపులూ తప్పేలాలూ, చెంచాలూ, చెంబులూ నోరుచేసుకోక తప్ప లేదు. "రాణీ అన్నం వడ్డించింది రావచ్చు" అనే సంగతిని కంచం పీటా చప్పుళ్ళుచేసి చెప్పేవి. "రాజాకి కొంచెం మంచినీళ్లు కావాలి" అనే భావాన్ని బల్ల గుద్ది మరీ చెప్పేది అతని చేతిలో కంచుగ్లాసు. అతను ఆఫీసుకి వెళుతూన్న సంగతిని తలుపు తెలియబరిస్తే, కూరలు పట్టుకు రావాలోయ్ అనే హెచ్చరికని సైకిలుకి తగిలించబడ్డ చేతిసంచి చెప్పేది. ఇలా ఇలా కొత్త భాష ఒకటి ఇంట్లో రోజురోజుకీ బలాన్ని పుంజుకోసాగింది.

"ఏమైనాసరే తనుచేసిన తప్పుపనికి క్షమార్పణ చెప్పుకొని ఆ మొక్కని పీకి పారేస్తే తప్ప ససేమిరా మాట్లాడకూడదని" రాజా నిశ్చయించుకున్నాడు.

"ఏదో పాపం మగవాడు పోనిద్దూ అంటూ తను ఎన్ని విషయాల్లోనో సద్దుకుపోతూంటే, ఈ విషయంలో ఇంత పట్టుదల పడతాడా? ఇంట్లో ఓ మొక్క పాతుకోడానికి కూడా తనకి హక్కు లేదూ? ఆ లేకపోవడం ఏమిటో ఈ దెబ్బతో తేలిపోవాలి" అంటూ కూర్చుంది రాణీ.

రోజులు గడిచినకొద్దీ పట్టుదలలూ పెరుగుతున్నాయి. వాటితోపాటు ఇబ్బందులూ అధికం అవుతున్నాయి. అయినా ఇద్దర్లో ఎవరూ దిగి రావడంలేదు 'దానికి అంత పౌరుషం ఏం?'. అని అతనూ, 'ఆయనకంత పట్టుదలయేం' అని ఆమే ఇద్దరూ భీష్మించుకొనే కూర్చున్నారు.

ఓరోజున రాజా కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఎదురుగుండా గోడగడియారంమీద పిచికలు గూడు పెడుతున్నాయి. అందులో పాపం మగపిచిక ఒళ్ళు హూనం అయేలాగ తెగ శ్రమపడుతూ ఒక్కొక్క గడ్డిపోచనే పట్టుకువచ్చి గూడు తయారు చేస్తూఉంటే, ఆడ పిచిక మాత్రం ఏం చెయ్యకుండా తమాషాగా అటూ ఇటూ తారట్లాడుతూ సాయంచేస్తున్నట్లు నటిస్తోంది. దానికితోడు మధ్య మధ్య తుర్రుమంటూ ఎగిరి వెళ్ళి దండెం తాడుమీద ఒయ్యారంగా కూచుని ఊగడం ఒకటి పల్లకీలో పెళ్ళికూతురులాగ, నువ్వు చచ్చినట్లు నౌకరులాగ చాకిరీ

చెయ్యి, నేను మహారాణీలాగ అంతఃపురంలో కులుకు తాను అనడం అలవాటైపోయింది. ఈ ఆడజాతికి, ఏమైనా చూస్తున్నాడు కదూ? ఈ ఆడవాళ్ళు మగవాళ్ళ ముక్కు పట్టుకొని మహా ఆడించేస్తున్నారు. ఈ సంగతేదో తేల్చెయ్యాలి. ఎంత ఇదయినా మరీ అంత అలుసా?

రాజాగారి ఆలోచనలు హాల్లో ఈ విధంగా తేలిపోతూంటే రాణీగారి భావాలు వంటిట్లో మరోలాగ నడిచిపోతున్నాయి.

“పెట్టిన పిల్లల్ని పాపం నోట కరుచుకుని ఆ ఆడపిల్లి ఒక్కటి యిల్లు యిల్లూ తిప్పుతూ నానా అవస్థలూ పడాలా? మగపిల్లికేం పట్టదా? నోరులేని జంతుజాలం దగ్గర్నుంచి మంచీ చెడూ తెలిసిన మనిషిదాకా ఈ ఆడా మగా విభేధం యిలా ఉండవలసిందే? మగవాళ్ళ దౌష్ట్యం ఈ విధంగా ఎన్నాళ్ళు సాగడం? ఊహు... వీల్లేదు... ఈ అన్యాయం యిలా సాగడానికి వీలులేదు.

రాజా, రాణీ భావాలు యిలా సాగిన రోజు నుంచీ పరిస్థితి మరింత బిగిసింది. ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోవడం మాట అలా వుంచి ఒకళ్ళనొకళ్ళు కన్నెత్తి చూసుకోవడం కూడా మానేశారు. అందువల్ల ఎన్నో యిబ్బందులూ వస్తున్నాయి. ఎన్నో యిరకాటాల్లోనూ పడుతున్నారు. అయినా రాజీకి ఎవరూ సిద్ధంకావడంలేదు. ఏదో పోనిద్దూ అని సర్దుకోవడమూ లేదు. పైగా యింత పట్టుదలా ఈ చిన్న విషయంలో అంటూ ఒకళ్ళమీద ఒకళ్ళు కోపం పెంచుకుంటున్నారు. తన పంతం నెగ్గడం ఎలా అని రాణి. తన మాట పైన ఉండేలా చెయ్యడం ఎలా అని రాజా తెగ ఆలో

చించేస్తూ, ఎత్తులకి పైఎత్తులు వేసేస్తూ అపర చాణక్యులయి పోతున్నారు అనుక్షణమూను.

ఓ రోజున రాజాకి భలే ఆలోచన తట్టింది.

అదే రోజున రాణీకి సరిగ్గా అలాంటి ఆలోచనే వచ్చింది.

వాళ్ళిద్దరికీ ఒకేలాగ వచ్చిన ఆలోచనల ఫలితంగా మర్నాడు ఆదివారంనాడు తెల తెలవారుతూండగా యిటు వైపు రైలులోంచి రాణీ అన్నగారైన లాయరు మధుసూధనరావూ, అటు రైలులోంచి రాజా అన్నగారైన లెక్చరర్ శ్రీనివాసరావూ, తమ తమ "బ్రీఫ్ కేసులు" పుచ్చుకొని రాజా రాణీల సామ్రాజ్యానికి వేంచేశారు. తన అన్నగారు ఎందుకు వచ్చాడో రాజాకి అర్థంకానట్టే తన అన్నగారు ఎందుకు వచ్చాడో రాణీకీ అర్థం కాలేదు. వచ్చిన యిద్దరూ సరేసరి ఒకళ్ళ నొకళ్ళు చూసి తెల్లబోయారు. భోజనాలయేదాకా ఊసూ పలుకూ ఏం లేదు. అంతా ముభావం. మూకీ వ్యవహారమూను.

కడుపులో కాస్త చల్లబడ్డాక మూకీనుండి టాకీ కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేస్తూ మధుసూధనరావు "ఊ... ఏమిటి బావగారూ? యివాళ ఆదివారం. కాలేజీ లేదనా యిలా బయలుదేరి వచ్చారు" అంటూ శ్రీనివాసరావుని పలకరించాడు.

శ్రీనివాసరావు "నేను సరే-మీరేవిటి? యివాళ ఖాళీకదా అనా ఓ ట్రిప్పు వేశారు?" అంటూ ఎదురు ప్రశ్న వేసి అతనికంటే రెండాకులు ఎక్కువ చదివాననిపించాడు.

"అవునుగాని అన్నయ్యా! నువ్వు వస్తున్నావని నాకు ముందుగా రాస్తే నేను స్టేషనుకి వచ్చేవాడినిగా?" అంటూ శ్రీనివాసరావుకేసి కొరకొరా చూశాడు రాజా. "అసలు నువ్విప్పుడు ఎందుకొచ్చావు?" అన్నట్లు ముఖంపెడుతూ.

—శ్రీనివాసరావు మరదలకేసి చూశాడు! తనకేం తెలియనట్లుగా రాణీ ముఖం అటు తిప్పి ఆకులికి సున్నం రాయసాగింది. దాంతో రాజాకి, రాజాతోపాటు మధుసూధనరావుకీ అర్థం అయిపోయింది. "మధుసూదనరావయితే వచ్చి చనువుగా చెల్లెల్ని నాలుగు కూకలేసి తనకీ రాణీకీ మధ్య తలయెత్తిన సమస్యని తనకి అనుకూలంగా పరిష్కారంచేసి వెళతాడనే ఉద్దేశంతో మధుసూధనరావుకి రాజా టెలిగ్రాం యిచ్చినట్లే, రాణీకూడా తన బావగారూ, సాక్షాత్తూ రాజా అన్నగారు అయిన శ్రీనివాసరావుకి టెలిగ్రాం యిచ్చి రప్పించి ఉంటుంది." అనే సంగతి.

అయితే ఎవరి బావగార్లకి వాళ్ళు టెలిగ్రాంలు యిచ్చారన్నమాట. "రేపు ఆదివారం ఖాళీచేసుకుని వచ్చి మా భార్యా భర్తలమధ్య వచ్చిన తగాదా తీర్చి, మా సంసారాన్ని చక్కదిద్ది వెళ్ళండిఅవటా" అంటూ.

యింకెందుకు ముసుగుల్లో గుద్దులాట అనుకుని, స్రైరెక్టుగా కేసులోకి వచ్చేసి చెల్లెల్ని అడిగేశాడు మధుసూధనరావు- "అమ్మాయి! అసలు నువ్వెందుకు అతనితో తగాదా పడవలసి వచ్చింది?" అంటూ.

పాఠం ఎలా మొదలెట్టాలా అని తెగ తికమక పడుతూన్న శ్రీనివాసరావుకి అవకాశం మహబలేగా వచ్చింది.

అయినా ఆయన నా స్టూడెంటుని అడుగుతాడేవిటి? వేసు కుంటే ప్రశ్నలు తన స్టూడెంటుని వేసుకోవాలి.

అదే అభ్యంతరాన్ని బహిరంగంగా తెలియపర్చాడు లెక్చరర్ శ్రీనివాసరావు.

జరిగిందేవిటో మొదట రాజాయే చెప్పాలంటే రాణీయే చెప్పాలంటూ కాస్సేపు వాగ్వాదాలు జరిగాయి వాళ్ళిద్దరి మధ్యా.

ఉన్న పుణ్యకాలం కాస్తా దీనితో అయిపోతుందని భయపడి "సరే-నేనే ముందు చెప్తా" అన్నాడు రాజా పెళ్ళిలో చివరికి తనే ముందు పేర్లు చెప్పిన సంఘటనని గుర్తుకు తెచ్చుకుంటూ.

జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి, "యింటి యజమానిగా, యింట్లో మొక్కలు పాతడమూ పాతకపోవ డమూ అనే హక్కు తనది అనీ తనతో సంప్రదించి తన అనుమతి పొందకుండా ముద్దాయీ ముద్ద మందారాన్ని పాతడం ద్వారా తన ప్రాథమిక హక్కులకి భంగం కలిగిం చిందనీ. అందువల్ల ఏలినవారు న్యాయం దయచేయించవల సిందనీ" ప్రార్థించాడు రాజారావు.

వెంటనే రాణీ కోపంగా సమాధానం చెప్పడానికి లేచింది "నువ్వు కూచో అమ్మాయి నీతరఫున ప్లీడర్ని చెప్పనీ" అన్నాడు మధుసూధనరావు.

"అక్కర్లేదు. సమాధాల్ని ఎప్పుడూ విద్యార్థుల దగ్గ ర్నుంచే రాబట్టడం ఉత్తను బోధనా లక్షణం చెప్పమ్మా

చెప్పు. నేను ఒప్పుకుంటున్నానుగా!" అంటూ శ్రీనివాసరావు తను పుచ్చుకోవలసిన వకాల్తనామాని తనపార్టీకే ఇచ్చేశాడు.

"అబ్బబ్బ ఈ మేష్టార్లకి మరీ కోర్టుఆచారాలు తెలియవ్వకదా!" అంటూ విసుక్కున్నాడు మధుసూధనరావు.

"అమ్మకానికని వచ్చిన మొక్కని కొనుటయా కొనక పోవుటయా అని తర్కంలోపడి ఆఫీసుకి వెళ్ళిన వ్యక్తి తిరిగి వచ్చేదాకా నిర్ణయం చెయ్యడం కుదరదు అంటే మొక్కలవాడు ఊరుకుంటాడా అనీ, కొన్న తర్వాత పాత కుండా కూర్చుంటే ఆ మొక్క యొక్క విలువైన జీవితాన్ని కొన్ని గంటలు తగ్గించినట్లు అవుతుందనీ పైగా వాడిపోతే వాడిపోవచ్చనీ, అదీకాక యిలాంటి ఇంటి విషయాలు పూర్తిగా ఆడవాళ్ళ వనీ, వీటిలో జోక్యం చేసుకోవడం స్త్రీల హక్కుల్నే ప్రశ్నించడం అవుతుందనీ, అందువల్ల యిది ప్రాథమిక హక్కుల సెక్షను కింద వస్తుందనీ" గట్టిగా వాదించింది రాణి.

ఎలాగైనా మరదలు, లాయరు చెల్లెల్ని అనిపించిందని సంతోషించాడు శ్రీనివాసరావు.

చెల్లెలి ఆవేదననీ ఆవేశాన్నీ, చూసి కొద్దిగా చలించి బుర్ర గోక్కుంటూ, "నిజమే-కేసు ఎటు తీర్పు చెప్పినా ఎవరో ఒకరి ప్రాథమిక హక్కుల్ని కాదన్నట్టే అవుతుంది" అంటూ నసిగాడు మధుసూధనరావు.

బావగారి గోడమీాద పిల్లి వాటంచూసి, "అయ్యో నేరక్కపోయి యితణ్ణి నమ్ముకున్నానే-యితను కాస్తా యిప్పుడు చెల్లెలివైపు తిరిగేసేలాగ ఉన్నాడు. ఎంతైనా రక్తసంబంధం

కదా? యిప్పుడు నాకేవిటిదారి?" అంటూ బిక్క మొహం వేసుకుని కూర్చున్నాడు రాజా.

తమ్ముడి ముఖం చూసేటప్పటికి శ్రీనివాసరావుకి జాలివేసింది. తను ఎవరి తరఫున వాదించడానికని వచ్చిందీ మరిచిపోయి, "ఏమైనా మరదలు కొంచెం తొందరపడింది. వాడు ఆఫీసు నుంచి వచ్చేదాకా కాస్త ఆగితే బాగుండి ఉండును. మొక్క అంత తొందరపడి పాతెయ్యకుండా" అంటూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

ఏం చెబుతున్నాడో ఏమిటో ఆలోచించకుండా, కేవలం ఎదుట ప్లీడరు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని కాదన డానికే అలవాటుపడ్డ లాయరు మధుసూధనరావు వెంటనే. "ఏమిటండీ ఆగడం? ఎలా ఆగుతుంది? నా భర్త యింటి దగ్గర లేరు వచ్చేదాకా ఆగు అంటే మొక్కలవాడు ఆగు తాడా? తీరా కొన్నాక ఆయన వచ్చేదాకా నాటడం కుద రదు అంటే మొక్క ఉంటుందా వాడిపోకుండా?" అంటూ అడ్డంపడ్డాడు.

"ఇదేమిటి? తన తరఫున వాదించబోయి యితను చెల్లెలి తరఫున వాదించేస్తున్నాడు" అని తెల్లబోయాడు రాజా.

వాదనలో శ్రీనివాసరావు ఏం తీసిపోకుండా "అయినా మరదలికి యిరుగ్గా ఉన్న ఆ స్థలమే కనిపించిం దేవిటి మొక్క నాటడానికి?" అన్నాడు.

"బావగారు చివరికి తన బుద్ధిపోనిచ్చుకున్నారు కాదు చూశావా? తన తరఫున మాట్లాడి తమ్ముడిని చనువుగా

నాలుగు చీవాట్లు పెడతారు కదా అని తను రప్పిస్తే తనని తప్పించి తమ్ముడిని సమర్థించుకుంటున్నారు" అనుకుంది రాణి.

"ఇరుగ్గా వున్న ఆ సందు కాకపోతే ప్లైయిన్ టేకాఫ్‌కి వేరే ఖాళీ స్థలం ఏదీ?" అన్నాడు లాయరు.

ఆ మాట వినేసరికి బావగారిని నాలుగు ఈ దవడా ఆ దవడా వాయిద్దాం అనిపించింది రాజాకి. లేకపోతే సందేమిటి, సందు? అత్యవసర మార్గం అనలేడూ?

"అయినా మనం ఆ స్థలాన్ని ఓ మారు కళ్ళతో చూసి మరీ వాదనలూ తీర్పులూ సాగించడం మంచిది అనుకుంటాను" అన్నాడు శ్రీనివాసరావు

అది మధుసూధనరావుకి కూడా సబబుగానే తోచింది.

వెంటనే నలుగురూ చిన్నపిల్లల రైలుబండి ఆటలోలాగ ఒకళ్ళ వెనకాల ఒకళ్ళు ఆ ఇరుకు సందులోకి కదిలి వెళ్ళారు. 'క్యూ' వెనక్కి తిరగడానికి వీలులేదని తెలుసుకుని, తిన్నగా అదే వరసలో ముందుకిపోయి నలుగురూ సందుకి ఆ చివర తేలారు.

దాంతో నలుగురికీ నీరసం వచ్చింది.

దానికితోడు కేసులో రాజా రాణీల యిద్దరి ప్రాథమిక హక్కులూ ఇరుక్కుపోయి, యెటు నిర్ణయం చెయ్యడానికీ వీలులేని, దిక్కుమాలిన దారపుచిక్కు గొడవలా తయారయింది పరిస్థితి.

పైగా ఒళ్ళు తెలియని వీరావేశంలో అటు వాదించవలసినవాళ్ళు యిటూ, యిటు వాదించవలసినవాళ్ళు అటూ మాట్లాడేశారు యిప్పటిదాకా.

ఇదంతా ఆలోచించి, యిద్దరూ కూడబలుక్కుని, అయినా మనకెందుకు లేనిపోని గొడవ రెండు రోజులుపోతే వాళ్లే సర్దుకుంటారు అంటూ గూడు పుఠాణీచేసి "ఇంతటితో కేసు వాయిదా వేద్దాం మళ్లీ మధ్యాహ్నం కాఫీలు అయ్యాక విచారిద్దాం" అంటూ శ్రీనివాసరావు మధుసూధనరావూ కలిసి సంయుక్త ప్రకటన చేశారు

వాళ్ళ పాలిట వరంలా మధ్యాహ్నం కాఫీలు తాగుతూంటే, రాజాకి ఉండుకున్న పాతిక ముప్పైమంది స్నేహితుల తండాలోనూ ఒక గౌరవనీయుడైన తండా సభ్యుడూ, రాజా పనిచేసే తాలూకా ఆఫీసు అనబడే దర్బారులోనే పనిచేసే ఒక సెక్షను అధిపతీ అయిన మంగపతి, సతీసుత సమేతంగా ఒక చిన్న సర్కసు కంపెనీలా వచ్చి పడ్డారు.

వాళ్ళ కబుర్లూ, రణగొణ ధ్వనీ అంతా వినేసరికి "హమ్మయ్య బతికాం, వీళ్లు వెళ్ళేదాకా ఆ కేసు గొడవ ఎత్తుకోనక్కర్లేదు" అనుకున్నారు మధుసూధనమూ, శ్రీనివాసుడూను.

ఏదో గంటో గంటన్నరో ఉంటాడు అనుకున్నారు కాని, మంగపతి యిలా భార్యా బిడ్డలతో నాలుగైదుగంటలు అక్కడ తిష్టవేస్తాడు అనుకోలేదు. వాళ్ళ కబుర్లతోనూ పిల్లల అల్లర్లతోనూ వరదలు వచ్చినట్లూ, భూకంపం, ఇళ్ళు కాలిపోవడం తృతీయప్రపంచ సంగ్రామంవంటి ప్రమాదాలు అన్నీ ఒక్కమారే ఆ యింట్లోకి చొచ్చుకు వచ్చేసినట్లూ అయిపోవడంతో, యింకా ప్రమాదంనుంచి మరి తప్పుకోక పోతే లాభంలేదనిపించింది వాళ్ళకి. బిక్కమొహాలు వేసుకుని

నిస్సహాయంగా కూచున్న రాజానీ రాణిని తాము వెంటనే ఆదుకోకపోతే లాభంలేదని కూడా గ్రహించారు. అందుకే మధుసూధనరావు శ్రీనివాసరావుతో "ఏమండీ బావగారు! మరి సినిమాకి వెళదాం అన్నారు. బయలుదేరరేం? టైమవుతోంది" అన్నాడు బిగ్గరగా అందరికీ వినిపించేలా.

రాజాకీ రాణీకి అర్థంకాక తెల్లబోయి చూశారు.

అవునండీ. మనం నలుగురం వెళదాం అనుకున్నాంగా" అన్నాడు శ్రీనివాసరావు 'ఇదే బాగుంది అని, పెళ్లాం పిల్లలతో బయలుదేరుదాం సినిమాకి అని సంబర పడుతున్నావేమో మంగపతీ-అదేం లాభంలేదు' అనే అర్థం వచ్చేలాగ.

"మరింక ఆలస్యం ఎందుకు? లేవండి. లే, రాణీ, లేవయ్యా బావగారూ!" అంటూ తొందర చేశాడు మధుసూధనరావు.

దాంతో మంగపతికికూడా లేవక తప్పలేదు. భార్య బిడ్డల్ని తీసుకుని లేస్తూ 'వస్తానండి' అని చెప్పి బలవంతంగా బయలుదేరాడు ఇంకో అల్పప్రాణిని మరో అయిదారు గంటలు ఏడిపించడానికి.

"ఇప్పుడు సినిమాకి ఎందుకు?" అన్నారు రాజా రాణీ ఏక కంఠంతో, మా తగాదా ఏదో ముందు తేల్చండి" అన్నట్లు ముఖాలు పెడుతూ.

అసలు అది తప్పించుకోవడం కోసమే. "అబ్బెబ్బె ఏమైనా వెళ్ళవలసిందే" అంటూ పట్టుబట్టారు.

సినిమా నుంచి రాగానే భోంచేసి, నిద్దర వస్తోందంటూ ఇద్దరూ చెరో మంచంమీద గుర్రు పెట్టి నిద్దర

పోయారు. రాత్రి తెల్లవాళ్లా పడక కుర్చీలో పడుకోవలసి వచ్చిన రాజా యిబ్బందినీ, వంట యింట్లో చాపమీద నిద్దర పట్టక అటూ ఇటూ దొర్లుతూ రాత్రి అంతాగడిపిన రాణీ అవస్థనీ ఏం గమనించకుండా.

తెలతెలవారుతూండగనే "ఏం బావగారూ! యిక్కడే తిష్టవేసేలా ఉన్నారు లేవరేం?" అంటూ పరస్పర హెచ్చరికలు చేసుకుంటూ మధుసూధనరావూ శ్రీనివాసం రావూ లేచి, తమతమ 'బ్రీఫ్ కేసులు' తీసుకుని మరి "వస్తాం" అంటూ బయలుదేరారు

"వచ్చినవాళ్ళు ఎలాగా వచ్చారుకదా! రెండు రోజులు ఉండి మరీ వెళ్ళండి అంటూ 'డ్యూయట్' పాడారు రాజా రాణీను.

"అబ్బే-వీల్లేదు. అర్జంటు పనులున్నాయి" అంటూ వాళ్లు 'కోరస్'లో సమాధానం చెప్పి స్టేషను వేపు అడుగు కదిపారు.

"ఇంతకీ మనం ఎందుకు వచ్చినట్టు ఎందుకు వెళుతున్నట్టు?" అన్నాడు దారిలో శ్రీనివాసరావు.

"ఆ...ఏదో...వాళ్ళనీ వంకని ఓమారు చూసి వెళుతున్నాం. వాళ్ళే సర్దుకుపోతారు. ఆలూమగల మధ్య అలకలు ఎన్నాళ్ళు ఉంటాయి లెద్దురూ" అన్నాడు మధుసూధనరావు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

అనుభవంలో పండిన ఆ పెద్దవాళ్ళ అంచనా తప్పు కాలేదు.

ఏమంటే_

వీధిమొగ తిరిగేదాకా వాళ్ళని చూచి, ఆ తర్వాత గేటు వేసి వస్తూండగా, రాజా రాణీని పరకాయించి చూసాడు. సరిగ్గా అదే సమయంలో ఆమె కూడా అతనికేసి చూసింది.

"ముఖం యెలా వాడిపోయిందో... ఈ అయిదారు రోజులనుంచీ పాపం చాలా వేదన పడుతోందన్నమాట?" అనుకున్నాడు రాజా.

"అయ్యో యెంత నీరసంగా ఉన్నారో అర్థంలేని యీ పంతాలూ పట్టింపులూ పెట్టుకొని ఆయన సంరక్షణే చూడలేదు పాపిష్టిదాన్ని" అనుకుంది రాణి.

తలుపు గడియవేసి గదిలోకి వస్తూ "రాణీ" అంటూ బరువుగా కంఠంతో ఉన్న ఆప్యాయత అంతా కనబరుస్తూ పిలిచాడు రాజా. ఆ పిలుపుతో నిలువెల్లా పులకించిపోయింది రాణీ. వెంటనే వచ్చి అతని గుండెల మీద తలపెట్టి వెక్కి వెక్కి ఏడవసాగింది. 'ఛ! అదేవిటి?' అంటూ కన్నీళ్లు తుడిచి అనునయించెడు రాజా...

చాలా సేపటివరకూ అతని గుండెల మీద తల పెట్టుకుని అలాగే ఉండిపోయింది తర్వాత పెద్ద భారంతీరినట్లు నిట్టూర్చి "ఏమండీ?...పోనీ మీ కంత యిష్టంలేకపోతే ఆ మందార మొక్కని పీకేస్తాను, ఏం?" అంది అతని కళ్ళల్లోకి చూస్తూ.

"పోనీలెద్దూ ... పాతిన మొక్కని తీసెయ్యడం ఎందుకూ? నాలుగు రోజులు కొంచెం తప్పించుకుని నడిస్తే

సరి పైకి ఎదిగిపోయి దానికి అడ్డుగా ఉండను" అన్నాడు ఆమె ముంగురుల్ని వేళ్ళతో సవరిస్తూ.

"నిజంగా?" అంది రాణీ,

— "ఆ...నిజంగా" అంటూ ఆమె నుదుటిమీద ముద్దు పెట్టుకుని దగ్గరగా తీసుకున్నాడు రాజా...

అతని కౌగిలిలో మురిసిపోతున్న రాణీనీ, ఆమె స్పర్శని అరమోడ్పు కన్నులతో చవి చూస్తున్న రాజానీ కిటికీలోంచి చూసి, అప్పుడే కొత్తగా వేస్తున్న మొగ్గని ఆకుల వెనకాల దాచబోయి, సందులో మందారం ఎర్రగా సిగ్గు పడింది.